క్లుప్తంగా

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలి

ఖమ్మంరూరల్: అర్హులైన పేదలకు అన్ని రకాల పింఛన్‌లు, రేషన్‌కార్డులు, డబుల్‌బెడ్‌రూం ఇళ్ల తక్షణమే మంజూరు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తారని పేర్కొన్నారు. రాష్ట్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రుణమాఫీ అమలుపై స్పష్టత లేదని దీంతో రైతులకు రుణమాఫీ అవుతుందా లేదా అనే సందిగ్ధత నెలకొందని, ఇప్పటికే బ్యాంక్‌ల్లో రైతుల పేరిట వడ్డీలకు వడ్డీలు పెరిగి అప్పులు గుదిబండగా మారాయని తక్షణమే రూ.లక్ష వరకు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పేదలు పౌష్టికాహారం లేక నానా ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమయంలో ప్రజా పంపిణీ పథకం ద్వారా అన్ని రకాల నిత్యావసర సరుకులు సరఫరా చేసి ఆదుకోవాలని కోరారు.

దుప్పట్ల పంపిణీ

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెం గ్రామంలో నిరుపేదలకు నేలకొండపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారి ఓరుగంటి నారాయణరావు సోమవారం గ్రామంలో నిరుపేదలకు దుప్పట్ల ను అందించారు. సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, బోడ్డు ఆంజనేయులు, కస్తాల గోపయ్య, వుల్లోజి అచ్చమ్మ, వడ్లమూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దాణా వితరణ


దాణ వితరణ చేస్తున్న దృశ్యం

ఖమ్మం అర్బన్: నగరంలోని గొల్లగూడెంలోని ఓం శ్రీ కృష్ణ గోశాలకు మాఘ బహుళ అమావాస్యను పురస్కరించుకొని దాతల వద్ద నుంచి సేకరించిన రూ.66 వేలు విలువ చేసే దాణాను అందించినట్లు శ్రీ స్తంభాద్రి సేవా సమితి కన్వీనర్ తుములూరి లక్ష్మీ నర్సింహరావు తదితరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ శ్రీనివాసరావు, జంగిలి రమణ, సూరినేటి మల్లేశం, పసుపులేటి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి చొరబడిన వ్యక్తి

ఖమ్మం అర్బన్: ఖమ్మం మధురానగర్‌లోని రోడ్డు నంబర్–12లో ఓ ఇంట్లోకి సోమవారం అజ్ఞాత వ్యక్తి ఇంట్లోకి చొరబడగా మహిళలు కేకలు వేశారు. దీంతో చుట్టుపక్కల వారు చేరుకుని ఆయనను బంధించి పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో తన పేరు రవి అని, షాద్‌నగర్ నుంచి వచ్చినట్లు సదరు వ్యక్తి చెప్పినట్లు తెలుస్తుండగా, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆర్టీసీలో అక్రమ బదిలీలు ఆపాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీలో అక్రమ బదిలీలు ఆపాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్ఎ ప్రభులతకు వినతి పత్రం అందజేశారు. కార్మికుల కుటుంబాల పరిస్థితిని పరిగణలో తీసుకుని వివిధ రీజియన్లకు పంపిన డ్రైవర్లను వెంటనే ఖమ్మం రీజియన్‌కు రప్పించాలని కోరారు. వినతి అందించిన వారిలో యర్రా శ్రీకాంత్, వై. విక్రం తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న కిడ్నీ వ్యాధులు

- రాంక్యా తండాలో పదుల సంఖ్యలో బాధితులు
- తాగునీటి సమస్యే కారణమని అనుమానాలు
- అధికారులు దయ చూపాలని వేడుకుంటున్న గ్రామస్తులు


లీకేజీతో గేటువాల్వ్ గుంతలో నిలిచిన నీరు


డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త


కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న తండావాసులు

రఘునాథపాలెం: జిల్లా కేంద్రానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న రఘునాథపాలెం మండలంలోని రాంక్యాతండా పంచాయతీ ప్రజలను కిడ్నీ సంబంధిత వ్యాధులు వెంటాడుతున్నాయి. ఇప్పటికే కిడ్నీ సమస్యలతో కొందరు మృతి చెందగా మరో 11 మందిపైగా మందులతో వాడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. మండలం రాంక్యాతండాలో కొన్నేళ్లుగా పలువురిని కిడ్నీ వ్యాధులు సోకుతున్నాయి.

నీటి సమస్య.. పారిశుద్ధ్య లోపం

గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా కంటే ముందు ఈ సమస్య తీవ్రంగా ఉండగా... ఇప్పటికీ పలువురు కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వాన్నంగా ఉందని చెబుతున్నారు. అలాగే, తాగునీరు సరఫరా చేసే మిషన్ భగీరథ వాల్వ్‌లు లీకై నీరు కలుషితం కావడం కూడా కారణం కావొచ్చని వాపోతున్నారు. ఓవైపు కిడ్నీల బాధతో అనేక మంది సతమతమవుతున్నా... అధికారులు, పాలకవర్గం తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ వహించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఒక గ్రామంలోనే ఇంత మంది కిడ్నీ వ్యాధుల బారిన నేపథ్యాన వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. ఇకనైనా ఎవరూ వ్యాధుల బారిన పడకుండా చూడడంతో పాటు ప్రస్తుతం బాధపడుతున్న వారిని మెరుగైన వైద్యం అందించాలని వేడుకుంటున్నారు.

పారిశుద్ధ్యం లేదు



మా గ్రామంలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. చెత్త సేకరించకపోగా, డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదు. దీంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. పలుచోట్ల మిషన్ భగీరథ తాగు నీటి పైపులు, గేటు వాల్వ్‌లు లీకై నీరు కలుషితమవుతోంది.

– గుగులోత్ బుజ్జి, మాజీ సర్పంచ్, రాంక్యాతండా

నరకం అనుభవిస్తున్నా..



కిడ్నీ వ్యాధి సమస్యతో నరకం చూస్తున్నా. కొన్నేళ్లుగా నన్ను ఈ వ్యాధి వేధిస్తోంది. రెండు కిడ్నీలు చెడిపోయి ఇబ్బంది పడుతున్నాను. నాలాంటి వారికి మెరుగైన వైద్యం అందించాలి. గతంలో అధికారులు సర్వే చేసినా ఆతర్వాత ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

– భూక్యా లచ్చా, రాంక్యాతండా

ఇబ్బంది పడుతున్నాం..



గ్రామంలో పలువురం కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్నాం. ప్రస్తుతం 11 మంది పైగా అనారోగ్యం బారిన పడిన వాళ్లు ఉన్నారు. అందరికీ పరీక్షలు చేయిస్తే మరికొందరు బయటపడే అవకాశం ఉంది. ఈ సమస్యపై అధికారులు, పాలకులు స్పందించాలి.

– గుగులోత్ లాలు, రాంక్యా తండా

11 మందికి పైగా బాధితులు



గ్రామంలో ఇప్పటి వరకు 11 మందిపైగా కిడ్నీ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. వీరిని అధికారికంగానే గుర్తించాం. గ్రామంలో తాగునీటి వాల్వ్‌ల లీకేజీలు ఎదురైతే ఎప్పటిప్పుడు సరిచేయిస్తున్నాం. పారిశుద్ధ్యంపై కూడా ప్రతిరోజు దృష్టి సారిస్తున్నాం.

– గాంధీ, గ్రామపంచాయతీ కార్యదర్శి

రేపటి నుంచి దత్తాత్రేయ ప్రతిష్ఠా మహోత్సవాలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం విజయనగర్ కాలనీ శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో బుధవారం నుంచి శుక్రవారం శ్రీ సిద్ధి వినాయక సహిత దత్తాత్రేయ స్వామి ప్రతిష్ఠాపన, యాగ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఫణిభట్ల రాజలింగయ్య శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ బుధవారం స్థల శుద్ధితో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. శుక్రవారం శ్రీ సిద్ధి వినాయక సహిత, దత్తాత్రేయ స్వామి వార్ల యంత్రబింబ స్థిర ప్రతిష్ఠాపన, హోమం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ బాధ్యులు బుద్దా రామకృష్ణ, పెంట్యాల వెంకటనర్సయ్య, కార్యదర్శి చంద్ర వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని సీపీకి వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంక్రైం: నగరంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థినులకు రక్షణ కల్పించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సీపీ విష్ణు యస్.వారియర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వసతి గృహాల్లో విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయిందని హాస్టల్స్ సిబ్బంది పట్టించుకోవడం మానివేశారన్నారు. అదేవిధంగా హాస్టళ్ల వద్ద కొంతమంది ఆకతాయిల చేరి ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. వడ్లమూడి సతీష్, లక్ష్మణ్, కరుణ్, శ్రీకాంత్, రాజష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలు అందజేస్తున్న మంత్రి పువ్వాడ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 25వ డివిజన్ గాంధీ పార్క్‌లోని గ్రంథాలయానికి స్థానిక కార్పొరేటర్ గోళ్ల చంద్రకళ వెంకట్, వి.రంజిత్ కుమార్ రూ.50వేల విలువైన పుస్తకాలను సమకూర్చారు. ఈ పుస్తకాలను సోమవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను మంత్రి అభినందించారు. మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో రూ.1.13 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రఘునాథపాలెం మండలంలో అభివృద్ధి పనులకు అత్యధికంగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోత్ గౌరి, తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీఓ రామకృష్ణ, పీఆర్ ఏఈ ఆదిత్య రాజ్, ఏఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బ్రాహ్మణ సంఘం బాధ్యులు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గోపాలపురంలో బ్రాహ్మణ సంఘ భవనం, మాదిరాజు కుటుంబీకుల నిర్మించిన అపర కర్మల భవనానికి వెళ్లేలా వంతెన నిర్మాణంపై విన్నవించారు. ఈకార్యక్రమంలో మాటూరి లక్ష్మీనారాయణ, మారంరాజు రాధాకృష్ణారావు, శ్రీకాంత్, వేదాంతం సత్యనారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, కళాశాల చైర్మన్ కృష్ణ

ఖమ్మంసహకారనగర్: ఇంజనీరింగ్ విద్యలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో మంచి అవకాశాలు ఉన్నందున విద్యార్థులు లక్ష్యం దిశగా ముందుకు సాగాలని వక్తలు సూచించారు. నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే సోమవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా కాలోజీ అవార్డు గ్రహీత సీతారాం మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు తమ లక్ష్యసాధనకు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఐటీ హబ్ బాధ్యులు రాజశేఖర్, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాసరావు, అకడమిక్ డైరెక్టర్లు, హెచ్ఓడీలు ఏ.వీ.వీ.శివప్రసాద్, డాక్టర్ జి.సుభాష్‌చందర్, డాక్టర్ జె.రవీంద్రబాబు, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు, పి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్జేసీలో ఫేర్‌వెల్ డే...

నగరంలోని ఆర్జేసీ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సమావేశం సోమవారం ఏర్పాటుచేయగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆర్జేసీ పీజీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివకుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీపతితో పాటు ఏ.లింగయ్య, ఉపేందర్, రాంబాబు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో భాగస్వాములు కావాలి


డేనియల్‌ను సన్మానిస్తున్న జిల్లా ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: సమాజ సేవలో యువత భాగస్వాములు కావాలని యంగ్‌మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్(వైఎంసీఏ) హైదరాబాద్ అధ్యక్షుడు వేర్పుల జయకర్ డేనియల్ సూచించారు. ఖమ్మంలో సోమవారం జరిగిన అసోసియేషన్ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు బీ.జీ.క్లెమెంట్ అధ్యక్షత వహించగా డేనియల్ మాట్లాడారు. కరోనా కష్టకాలంలో అసోసియేషన్ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అనంతరం డేనియల్‌ను జిల్లా బాధ్యులు సన్మానించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ వివిధ జిల్లాల బాధ్యులు విలియం, జెడ్.టీ.సుధాకర్, శేఖర్‌రాజు, శేఖర్ బాబు, శిల్వాజాన్సన్, జేపీ.సత్యానంద్, కొమ్ము జోర్డన్, జెసన్ అలెగ్జాండర్, సుగుణ రాజేందర్, దుశ్యాజాన్, పిల్లి విజయబాబు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వై.ఎస్.షర్మిల అక్రమ అరెస్టు గర్హనీయం


రాస్తారోకో చేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల అరెస్టు గర్హనీయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు అన్నారు. ఈమేరకు మండల కేంద్రంలో సోమవారం ధర్నా, రాస్తారోకో చేపట్టగా సుధీర్‌బాబు మాట్లాడుతూ ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు షర్మిల పాదయాత్ర నిర్వహిస్తుండగా తమ లోపాలు బయటపడతాయనే నెపంతో బీఆర్ఎస్ నేతలు అడుగడుగునా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఈక్రమంలోనే మహబూబాబాద్ జిల్లాలో అరెస్టు చేయించారని ఆరోపించారు. అయితే, ఎన్ని అడ్డంకులు ఎదురైనా షర్మిల పాదయాత్ర జరిగితీరుతుందని అన్నారు. ఇక నేలకొండపల్లిలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు గుగులోతు రూప్లానాయక్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు ఇకనైనా షర్మిలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ తిరుమలాయపాలెం మండల అధ్యక్షుడు వాలూరి సత్యనారాయణతో పాటు నాయకులు ఆలస్యం రవి, రావుల జగన్నాథరెడ్డి, కొత్త బాలాజీరావు, రాంబాబునాయక్, గుండా సందీప్‌రెడ్డి, ఆలేటి రాములు, సీతారాం, వద్దిరాజు లక్ష్మి, చీకటి శ్రీనివాస్, లావూరి కోటేశ్వరరావు, రేలా నరసింహారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిష్కరించండి


దరఖాస్తులు పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రతీ ఫిర్యాదును పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కేఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్, రెవెన్యూ మేళాలో కమిషనర్ ఫిర్యాదులు స్వీకరించారు. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన 25 మంది తదితర సమస్యలపై ఫిర్యాదులు చేశారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలకు వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ బి.మల్లీశ్వరి, ఆర్వో జి.శ్రీనివాస్, ఆర్ఐ లోకేష్‌కుమార్, టీపీఎస్ సంతోష్, ఏఎస్వో వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

సెలవులో జలవనరుల శాఖ ఎస్ఈ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం జలవనరుల శాఖ ఎస్ఈ నర్సింగరావు ఆరోగ్య కారణాలతో నాలుగు రోజుల పాటు సెలవుల్లో వెళ్లారు. దీంతో ఇన్‌చార్జ్ ఎస్ఈగా కల్లూరు ఎస్ఈ ఆనంద్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి


మాట్లాడుతున్న ఏపీడీ జయశ్రీ

నేలకొండపల్లి: మహిళ సమాఖ్యలు ఆర్థిక స్వావలంబన సాధించడం ద్వారా మరికొందరికి ఆదర్శంగా నిలవాలని ఐకేపీ ఏపీడీ జయశ్రీ సూచించారు. మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఆమె వీఓఏలతో సమావేశమై పలు సూచనలు చేశారు. సంఘాల బలోపేతం కోసం రుణాలు చెల్లింపులు, వసూళ్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు గాను సమాఖ్యలు చైతన్యం కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ఎం రవీందర్, ఏపీఎం అశోక్ రాణి, మండల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	వినరో భాగ్యము విష్ణుకథ
సాయిరాం	యాంట్- మ్యాన్ (తెలుగు)
ఆదిత్య	యాంట్- మ్యాన్ (ఇంగ్లీష్)
శ్రీనివాస	వాల్తేరు వీరయ్య
సుందర్	అమిఘోష్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	24		20
కాకర	30	చుక్కకూర	2
బీర	46		10
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	36		10
చిక్కుడు	56	గోంగూర	2
గోరుచిక్కుడు	46		10
క్యాబేజీ	16	మెంతికూర	5
క్యాలీఫ్లవర్	25		20
ఆలుగడ్డ	20	కొత్తిమీర	1
చామగడ్డ	64		20
క్యారెట్	34	పుదీన	1
క్యాప్సికం	46		20

-ఖమ్మం వ్యవసాయం

అభయహస్తం నిధులను తిరిగి ఇవ్వాలి



ధర్నా చేస్తున్న పీఓడబ్ల్యూ నేతలు, మహిళలు

ఖమ్మంమయూరిసెంటర్: అధికారం కోసం హామీలు ఇచ్చిన సీఎం కేసీఆర్ అందలమెక్కిన తర్వాత హామీల్ని విస్మరిస్తున్నారని పీఓడబ్ల్యూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర అరుణ అన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, అభయహస్తం చెల్లించిన వారికి తిరిగి నిధులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తొలుత మహిళలు ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ.. మహిళలు వడ్డీతో సహా బ్యాంకుల్లో రుణాలను తిరిగి చెల్లిస్తున్నా.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వడ్డీని తిరిగి ఇవ్వడంలో జాప్యం చేస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి బకాయిలు వచ్చే వరకు మహిళలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అభయహస్తం పథకం కింద సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, పథకం అమలు చేయకుండా, వారి డబ్బు తిరిగి ఇవ్వకుండా ప్రభుత్వం మహిళలను దగా చేస్తుందన్నారు. తక్షణమే స్వయం సహాయక సంఘాల సభ్యుల సమస్యలను పరిష్కరించి, వారి బకాయిలను విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లగుండ్ల శిరోమణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకినేపల్లి లలిత, ఝాన్సీ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, పీఓడబ్ల్యూ సంఘ జిల్లా ఉపాధ్యక్షురాలు ఆవుల మంగతాయి, జిల్లా కోశాధికారి శీలం పూలమ్మ, గోకినపల్లి సరోజిని, గుడుచుట్టు వసుమతి, బండెల లలిత, ఇస్లావత్ స్వాతి, గంటా వెంకట నరసమ్మ, అమర్లపూడి కోటమ్మ, పరిమళ, నీల, చైతన్య, కొట్టి సత్యవతి, షాన్, భారతమ్మ, కంప సాటి మమత, టి సరోజినీ, సుగుణమ్మ, వనిత, బుజ్జి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నాలుగు నెలలుగా గ్రామాల్లో పని చేసే పంచాయతీ కార్మికులకు జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏ.అప్పారావు, జిల్లా కార్యదర్శి పి.రామదాస్‌లు అన్నారు. సోమవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ... కార్మికులకు వేతనాలు సక్రమంగా రాక కుటుంబాలు గడవడం కష్టంగా ఉందన్నారు. కలెక్టర్, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఈ సమావేశంలో భిక్షం, నారాయణ, వెంకటేశ్వరరావు, నరేష్, సైదులు, రాజు, రాంబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పారావు

ఆటో స్టార్టర్లు తొలగించడం సరికాదు


రఘునాథపాలెం: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రఘునాథపాలెం: వ్యవసాయానికి సరైన రీతిలో విద్యుత్ సరఫరా చేయకుండా, రైతులు మోటార్లకు ఏర్పాటుచేసుకున్న ఆటో స్టార్టర్లను బలవంతంగా తొలగించడం సరికాదని సీపీఎం రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు సోమవారం విద్యుత్ ఏఈఈకి వినతిపత్రం అందజేశారు. అనంతరం నవీన్ మాట్లాడుతూ... రైతులు లేని సమయాన పొలాల్లోకి వెళ్లి ఆటో స్టార్టర్లను తొలగించడం ఏంటని ప్రశ్నించారు. ఇకనైనా అధికారులు తీరు మార్చుకోకపోతే ఆందోళనలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వంకాయలపాటి వెంకటేశ్వర్లరావు, వల్లూరు శ్రీనివాసరావుతో పాటు షేక్ ఇమాం, కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.


కూసుమంచిలో..

కూసుమంచి: వ్యవసాయ మోటార్లకు రైతులు ఏర్పాటు చేసుకున్న ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించొద్దని కోరుతూ పాలేరులో తెలంగాణా రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం రైతులు రాస్తారోకో చేపట్టారు. ఏఈ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ అధికారులు రైతులకు తెలియకుండానే స్టార్టర్‌లను తొలగిస్తున్నారని, వెంటనే ఈ చర్యలను నిలిపివేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి బిక్కసాని గంగాధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇస్తున్నామని చెబుతున్నా అది అమలు కావటం లేదన్నారు. స్టార్టర్లు లేకపోతే ఇక రైతులు మోటార్ల వద్దనే పడిగాపులు కాయాలన్నారు. ఈ కార్యక్రమంలో సన్మంతరావు, ఎడవెల్లి రమణారెడ్డి, కర్ణబాబు, ఉపేందర్, వీరారెడ్డి, వెంకన్న, రంగయ్య, మాధవరావు పాల్గొన్నారు.